ఈనాడు ఆదివారం

Sunday , May 30, 2010



# మేము సైతం

ఖైరతాబాద్ పేరు వినగానే... భారీ వినాయకుడు, గణేష్ నవరాత్రులు గుర్తొస్తాయి. ఆ గణనాధుడి సన్నిధిలో మరో సత్కార్యం చేస్తున్నారు స్థానిక యువకులు.



హైదరాబాద్ మహానగరంలో అన్నీ ఖరీదే. ఉప్పూపప్పుల నుంచి ఉన్నత చదువుల వరకూ అంతా ఖర్చే. అలాంటి చోట ఉచితం గురించి ఆలోచించడం అనుచితమనే చెప్పాలి. కానీ ఆ అరుదైన మాట ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ నుంచి వినిపిస్తోంది. వీరు వేసవిలో కంప్యూటర్ చదువులు ఉచితంగా చెబుతున్నారు. స్కూల్ పిల్లలనుంచి ఉద్యోగుల వరకూ అందరికీ ఇక్కడ ప్రవేశం కల్పిస్తారు. ఖైరతాబాద్ ప్రాంతం వారితోపాటు నాంపల్లి, అమీర్‌పేట్, షేక్‌పేట్, సనత్‌నగర్, రాజ్‌నగర్... ఇలా నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడ ఉచిత శిక్షణ తీసుకుంటున్నారు. ఎమ్.ఎస్.ఆఫీస్, సి, సి ప్లస్, జావా, టాలీ, డీటీపీ, వెబ్‌డిజైనింగ్... కోర్సుల్లో ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. స్కూల్ పిల్లలకు పరిచయ కోర్సులు చెబుతున్నారు. స్థానికులతో పాటు ఉద్యోగాలకోసం రాష్ట్ర నలుమూలల నుంచి హైదరాబాద్ వచ్చిన యువత కూడా ఇక్కడ చేరుతున్నారు.

ఉచితమనే కానీ బయట సంస్థల కంటే నాణ్యమైన చదువునే వీరు అందిస్తున్నారు. ఇతర సంస్థల్లో ఫీజుకట్టి చేరినా విద్యార్థికి కేటాయించిన సమయంలోనే క్లాసు, ప్రాక్టికల్స్ పూర్తిచేయాల్సి ఉంటుంది. ఇక్కడ అలాంటి ఇబ్బంది లేదు. విద్యార్థులకు పాఠాలు వివరంగా చెప్పే ఉపాధ్యాయులు ఉన్నారు. ఉదయం ఏడు నుంచి సాయంత్రం తొమ్మిది వరకూ ల్యాబ్ అందుబాటులో ఉంటుంది. సాధారణంగా ఏటా ఏప్రిల్ 20 తర్వాత ఈ క్లాసులు ప్రారంభమవుతాయి. విద్యార్థుల కోరిక మేరకు వేసవి సెలవుల తర్వాత కూడా క్లాసులు కొనసాగిస్తారు. కోర్సుకు అవసరమయ్యే పుస్తకాలు కూడా వీరే అందిస్తారు.

* * *

కంప్యూటర్స్‌లో డిగ్రీలు చేస్తున్నవారూ ఇక్కడకు వస్తున్నారు. కారణం అడిగితే... 'కాలేజీలో పరీక్షలకు మాత్రమే సిద్ధం చేస్తారు. ఇక్కడ అన్ని అంశాలూ వివరంగా నేర్పుతూ వాస్తవంగా ఆయా కోర్సులు ఎలా ఉపయోగపడతాయో చెబుతారు' అని బదులిస్తున్నారు. కోర్సు ముగిసిన తర్వాత పరీక్షపెట్టి వీరికి సర్టిఫికెట్‌లు అందిస్తారు. ఈ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించింది స్థానిక యువకుడు రాజ్‌కుమార్. దీనికి పునాదులు ఎలా పడ్డాయని ఆయన్ని అడిగితే... 'అమ్మానాన్న అక్షరాస్యులు. అక్కాచెల్లెళ్లు కూడా ఉన్నత చదువులకు వెళ్లారు. నేను పదో తరగతి తర్వాత ఐటీఐ చేశాను. కానీ అన్నింటా పాస్ మార్కులే వచ్చాయి. ఉద్యోగ వేట మొదలుపెట్టినపుడు తెలిసింది నాది అరకొర చదువని. ఇప్పుడు నాన్న నడిపే పాన్‌షాప్‌నే చూసుకుంటున్నాను. నాలాంటి పరిస్థితి అందరికీ రాకూడదనుకున్నా. అప్పుడే ఉచిత కోచింగ్ సెంటర్ ఆలోచన తట్టింది' అని చెబుతాడు రాజ్‌కుమార్. కోచింగ్ సెంటర్ అంశాన్ని మిత్రుడు జాన్‌కి చెబితే రోజూ రెండు గంటలు పాఠాలు చెప్పేందుకు సిద్ధమయ్యాడు. దాంతో రాజ్‌కుమార్ తన ఇంట్లో చెల్లి ఉపయోగించే కంప్యూటర్ తెచ్చి కోచింగ్ సెంటర్ ప్రారంభించాడు. అందుకు ఖైరతాబాద్ లైబ్రరీని వేదికగా చేసుకున్నాడు. సుభాష్‌రెడ్డి అనే మరో మిత్రుడికి విషయం తెలిసి తన కంప్యూటర్ ఇచ్చాడు. అలా ప్రారంభించిన మొదటి సంవత్సరం(2005) 50 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. మరుసటి ఏడాది విద్యార్థుల సంఖ్య పెరగడంతో రాష్ట్ర మంత్రి దానం నాగేందర్‌ను కలిసి శిక్షణ కేంద్రం గురించి చెప్పాడు రాజ్‌కుమార్. ఆయన నాలుగు కంప్యూటర్లకు ఆర్థికసాయం చేస్తే, స్థానిక యువకుడు మహేష్ యాదవ్ ఫర్నిచర్ సమకూర్చాడు. ఆ తర్వాత మిత్రుల సహకారంతో మరో రెండు కంప్యూటర్లు కొన్నారు. ఆపై ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం పాఠాలు చెప్పడం మొదలుపెట్టారు. ఈ సంవత్సరం 200 మంది విద్యార్థులు వస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది అమ్మాయిలే. అందులో ముస్లిం విద్యార్థులు కూడా అధిక సంఖ్యలో ఉన్నారు.



* * *

శ్రీనివాస్, రమేష్, ప్రదీప్, మురళీకృష్ణ... వీరంతా అక్కడ శిక్షకులు. వివిధ సంస్థల్లో ఉద్యోగాలు చేస్తూనే తీరిక చేసుకొని మరీ పాఠాలు చెబుతారు. ఇద్దరు ఎంసీఏ విద్యార్థులు కూడా పాఠాలు చెబుతున్నారు. వీరిలో ఒకరు ఉదయం పాఠాలు నేర్చుకుంటూ మధ్యాహ్నం స్కూల్ పిల్లలకు నేర్పుతారు. మరో ఎంసీఏ విద్యార్థిని సల్మా... గతంలో ఇక్కడే పాఠాలు నేర్చుకుంది. 'మా ఇంట్లో కంప్యూటర్ లేదు. ఎంసీఏ చేస్తున్న రెండేళ్లూ ఇక్కడ క్లాసులకు హాజరవుతూ ప్రాక్టికల్స్ చేసుకునేదాన్ని. ఇప్పుడు రోజూ ఓ గంట పాఠాలు చెప్పడానికి వస్తుంటా. నేర్చుకున్న చోటే పాఠాలు చెబుతుంటే ఎంతో ఆనందంగా ఉంది' అంటోందామె. కోచింగ్ సెంటర్ నిర్వహణలో రాజ్‌కుమార్‌కి ఆయన తండ్రి సుదర్శన్ నుంచి పూర్తి మద్దతు లభిస్తోంది. సుదర్శన్ ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ కార్యదర్శి. ఆయన ప్రోత్సాహంతోనే వినాయక విగ్రహం నిలిపే లైబ్రరీలోనే ఈ క్లాసులు చెబుతున్నారు.

ఖైరతాబాద్‌తో పాటు యూసఫ్‌గూడలోని స్టేట్‌హోమ్ (అనాథ శరణాలయం)లో కూడా వీరు కంప్యూటర్ క్లాసులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల కోరిక మేరకు మున్ముందు

స్పోకెన్ ఇంగ్లిష్ పాఠాలూ చెప్పించే ఆలోచన ఉందంటున్నారు రాజ్‌కుమార్.

PREVIOUS NEXT

| | | |
|---|---|---|
| Your Mail Id : | | |
| Mail This Link To email id : | | Send Link |